# నమస్తే తెలంగాణ
## మహబూబ్‌నగర్
### నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, సోమవారం 10 ఫిబ్రవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET


## అబద్ధాల కోరు రేవంత్..

జనవరి 26న సాక్షాత్తు అంబేద్కర్ రాజ్యాంగం అమలైన రోజు కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో నాలుగు పథకాలను ప్రారంభించి అర్ధరాత్రి నుంచి డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు తదితర హామీలు కూడా ఆటకెక్కించారు. రైతు భరోసా ఇస్తామని ఆరు సార్లు ముఖ్యమంత్రి హోదాలో అబద్ధాలు వల్లించారు. సంక్రాంతికి వేస్తామని.. దసరాకు ఇస్తామని.. దీపావళికి వేస్తామని.. చెప్పి ఒక్క ఎకరా వరకు రైతుభరోసా వేశామని చెబుతున్నారు.. అది కూడా ఇంతవరకు పూర్తిస్థాయిలో పడలేదు. ముఖ్యమంత్రి ఒక మాట మాట్లాడుతుంటే మంత్రులు తలో మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు మా పోరాటం ఆగదు. ఆ పార్టీ మెడలు వంచుతామని ప్రజలకు జవాబుదారీగా ప్రజాక్షేత్రంలో నిలబెడతాం. కోస్గిలో జరిగే రైతు నిరసన దీక్షకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా విజయవంతం చేసి తీరుతాం. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి.

– పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కొడంగల్

## లగచర్ల బాధిత రైతులకు అండగా..

కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి బలవంతంగా గిరిజనుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తుండడంతో లగచర్ల రైతులు తిరగబడ్డారు.. జైలుకు సైతం వెళ్లి వచ్చారు. అప్పట్లో లగచర్ల రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ అండదండగా నిలిచింది. ఫార్మా క్లస్టర్‌ను వెనక్కి తీసుకున్నట్లే అని ప్రకటించిన ప్రభుత్వం వెనువెంటనే మళ్లీ పారిశ్రామిక కారిడార్‌కు భూసేకరణ చేపట్టింది. ఈ భూసేకరణ కూడా గిరిజన రైతులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కోస్గికి వస్తున్న కేటీఆర్ మార్గమధ్యంలో లగచర్ల తదితర గ్రామాల రైతులను పరామర్శించనున్నారు.

## కేటీఆర్ పర్యటన ఇలా..


- ఉదయం పదిన్నర గంటలకు హైదరాబాద్‌లోని నార్సింగ్ నుంచి బయలుదేరుతారు.
- మధ్యాహ్నం 1:40 బోంరాస్‌పేట మండలం తుంకిమెట్ల వద్ద బీఆర్‌ఎస్ పార్టీ జెండావిష్కరణ
- మధ్యాహ్నం 2 గంటలకు హకీంపేట, లగచర్ల,కోడైపల్లి, రోటిబండతండా గ్రామాల రైతులకు పరామర్శ
- మధ్యాహ్నం 3 గంటలకు కోస్గి చౌరస్తాలో నిర్వహించే రైతు మహాధర్నాలో పాల్గొంటారు.



# నేడు కోస్గికి కేటీఆర్

**సీఎం ఇలాఖాలో రైతు దీక్షకు శ్రీకారం**

- భారీ ఎత్తున రైతులను సమీకరించేందుకు బీఆర్‌ఎస్ ప్లాన్
- కేటీఆర్ రాకతో కొడంగల్‌లో మారనున్న రాజకీయ సమీకరణలు
- రైతు మహాధర్నాకు సర్కార్ అడ్డంకులు
- కోస్గిలో దీక్షకు భారీ బందోబస్తు
- బీఆర్‌ఎస్ నేతలపై నిఘా
- ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నేతలు
- రేవంత్ అబద్ధాలను ఎండగడతాం
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కోస్గిలో రైతు నిరసన దీక్షకు సిద్ధమవుతున్న వేదిక

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎవరిన్ని కుట్రలు చేసినా.. ఇచ్చిన హామీలు, పథకాలు అమలు చేసి తీరుతామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ దమననీతిని ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ రైతు మహాధర్నాకు పిలుపునిచ్చింది. బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కోస్గి పట్టణంలో జరిగే రైతు నిరసన దీక్షలో పాల్గొనడానికి వస్తున్నారు. సోమవారం కోస్గి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరిగే రైతు నిరసన దీక్షకు పార్టీ నేతలు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. వేలాది మంది రైతులతో నిర్వహించే ఈ సభకు కేటీఆర్‌తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మం త్రులు, మహబూబ్‌నగర్, వికారాబాద్ పార్లమెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొంటున్నారు. కొడంగల్ నియోజకవర్గంతో పాటు నారాయణపేట జిల్లా నుంచి పెద్దఎత్తున రైతులు హాజరవుతున్నారు. ఇప్పటికే పార్టీ నేతలు ఆయా మండలాల్లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి రైతులను నిరసన దీక్షకు రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమిచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు కాకపోవడంతో భారీ ఎత్తున రైతులు వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించి ఆదివారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మాజీ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సలీం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ ఇతర పార్టీ నేతలు కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. మరోవైపు కేటీఆర్ రైతు నిరసన దీక్షకు తరలి వెళ్లకుండా బిగ్ బ్రదర్ రంగంలో దిగినట్లు సమాచారం. కొడంగల్ నియోజకవర్గం నుంచి రైతులు పాల్గొనకుండా కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కోస్గికి కేటీఆర్ వస్తుండడంతో పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. మరో వైపు బీఆర్‌ఎస్ నేతలపై నిఘా ఉంచారు. ఎట్టి పరిస్థితుల్లో రైతు నిరసన దీక్షను విజయవంతం చేసి.. ముఖ్యమంత్రి అబద్ధాలను ఎండగడతామని పార్టీ నేతలు అంటున్నారు.

**మహాధర్నాకు భారీ ఏర్పాట్లు..**


రాష్ట్రంలో బీఆర్‌ఎస్ తరపున నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలు కనీవిని ఎరగని రీతిలో విజయవంతం అవుతుండడంతో సర్కారులో గుబులు రేగుతోంది. సోమవారం సాక్షాత్తు సీఎం నియోజకవర్గంలోని కేటీఆర్ పర్యటిస్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ నిరసన దీక్ష చర్చనీయాంశంగా మారింది. గత నెల రిపబ్లిక్ డే రోజు ఇదే కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగు పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. అర్ధరాత్రి నుంచి రైతుల ఖాతాల్లో లబ్ధిదారుల ఖాతాల్లో టకిటకీమంటూ డబ్బులు పడతాయని హామీ ఇచ్చారు. సాక్షాత్తు సీఎం ఇచ్చిన హామీకే విలువ లేకుండా పోయిందని.. అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఇదే వేదికగా రేవంత్ ప్రశ్నిస్తామని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారు.

**హామీలు అమలయ్యే వరకు వదిలిపెట్టేదే లేదు..**

అసెంబ్లీ ఎన్నికల్లో 420 వాగ్దానాలను చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 14 నెలలవుతున్నా ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని.. బీఆర్‌ఎస్ నేతలు మండిపడుతున్నారు. రైతుబంధు ఇస్తామని ప్రకటించి ఇప్పటివరకు ఇవ్వలేదని.. ముఖ్యమంత్రి హోదాలో ఈ పండుగకు వేస్తా ఆ పండుగకు వేస్తా అంటూ కాలం గడిపాడని.. రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని.. కల్యాణలక్ష్మి తోపాటు తులం బంగారం ఇస్తామంటూ బూటకపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. రూ.2000 పింఛన్ రూ.4000 చేస్తామని.. మహిళలకు రూ.2500 అకౌంట్లో వేస్తామని.. అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేయడం ఆ గ్రామంలో కూడా లబ్ధిదారులకు వేయకుండా కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఈ మోసాలను ఎండ కట్టేందుకే పార్టీ తరపున చేపట్టిన రైతు నిరసన దీక్షకు పెద్ద ఎత్తున స్పందన వస్తుందని.. పార్టీ నేతలు అంటున్నారు.

**గులాబీ మయంగా మారిన కోస్గి..**

కొడంగల్ రైతు మహాధర్నాకు విచ్చేస్తున్న కేటీఆర్‌కు పార్టీ నేతలు ఘనస్వాగతం పలుకుతున్నారు. కోస్గి పట్టణం మొత్తం గులాబీ మయంగా మారింది. ఇదిలా ఉండగా జూనియర్ కళాశాల మైదానంలో జరిగే కేటీఆర్ సభకు పోలీసులు నిఘా పెట్టారు. మఫ్టీ పోలీసులు స్టేజీ సమీపంలోని తిరుగుతూ ఎవరెవరు వచ్చి పోతున్నారు.. మీడియాతో ఏం మాట్లాడుతున్నారు? అనే విషయాలను ఆరా తీస్తుండడం కనిపించింది. మరోవైపు గ్రామాల్లో మండలాల్లో బీఆర్‌ఎస్ నేతలపై కూడా నిఘా ఉంచారు. రైతు నేరసన దీక్ష విజయవంతం కాకుండా బిగ్ బ్రదర్ సర్వశక్తులు వడుతున్నట్లు పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.



కోస్గిలో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం



పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పల్లెగడ్డతండా కాంగ్రెస్ నాయకులు

## రైతులకు అండగా బీఆర్‌ఎస్ రైతుదీక్ష

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్, ఫిబ్రవరి 9 : మాటల గారడి, అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పట్నం మట్లాడుతూ రైతుల పక్షాన నిలబడి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలను అమలు చేయకుండా వారిని మోసం చేస్తున్నదని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ రైతులకు అండగా వారికి ప్రభుత్వం ఇస్తామన్న రైతు భరోసా, రుణమాఫీ, పంటల బోనస్ తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోస్గి పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష, బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని, నారాయణపేట జిల్లాతోపాటు కొడంగల్ నియోజకవర్గానికి చెందిన రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండలంలోని పల్లెగడ్డతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, నాయకులు ఎండీ సలీం, విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలో మన్యంకొండ అభివృద్ధి



మన్యంకొండ బ్రహోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, ఫిబ్రవరి 9 : బీఆర్‌ఎస్ హయాంలో మన్యంకొండ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ బ్రహోత్సవాల పోస్టర్‌ను మాజీ మంత్రి ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ హయాంలో మన్యంకొండను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని తెలిపారు. కొండపైకి వెళ్లేందుకు నాలుగు వరసల రహదారి, అతిథి గృహం, కల్యాణమండపంతో పాటు బ్రహోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు గుర్తుచేశారు. అంతకుముందు దివిటిపల్లిలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం ప్రాగణంలో నూతనగా నిర్మించిన జిట్ట ఆంజనేయస్వామి విగ్రహం, నవగ్రహాలు, ధ్వజస్తంభం, పోచమ్మ, నాభిశిల బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు హాజరయ్యారు.

కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, వెంకటస్వామి, రాంలక్ష్మణ్, నవకాంత్, గణేశ్,దేవస్థాన ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, రాములు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



అయిజ : కుటుకనూర్‌లో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ, ఫిబ్రవరి 9 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం మండలంలోని కుటుకనూర్ గ్రామంలో రాజాపురం గుంటి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను అలంపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నేత, పీఏసీసీఎస్ మాజీ అధ్యక్షుడు సంకాపురం రాముడుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడలతో యువతలో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. గ్రామీణ క్రీడాకారులు, పట్టణ ప్రాంత క్రీడాకారులతో పోటీ పడి జిల్లా, రాష్ట్రస్థాయి క్రికెట్‌లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉత్సవాలను పురస్కరించుకుని రైతులు, యువత ఆనందోత్సవాల నడుమ రైతు సంబురాలు, క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిన్న రాములు, బీఆర్‌ఎస్ నాయకులు బెంజిమెన్, ముక్తర్, బీందాస్, బందెనవాజ్, బ్రహ్మయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ



- హాజరైె శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక, రాజకీయ నేతలు
- చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకొన్న మిత్ర బృందం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 9 : వనపర్తి జిల్లా కేంద్రంలోని చిట్యాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సరస్వతీ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1974–75 సంవత్సరంలో వనపర్తి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఈ స్వర్ణోత్సవాలను నిర్వహించారు. పాఠశాల విద్యను పూర్తి చేసి 50 ఏండ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు వేడుకలు నిర్వహించారు. వివిధ వృత్తులు ఇంజినీర్లు, వైద్యులుగా, వ్యవసాయదారులుగా, వ్యాపారవేత్తలుగా, న్యాయవాదులుగా, రాజకీయ, ఉద్యోగ రంగాలలో సేవలందిస్తూ మరికొంత మంది విరమణ పొందిన పూర్వ విద్యార్థులు హాజరై నిర్వహించిన కలయిక ఎంతో ఆనందాన్ని, ఉత్సహాన్నిచ్చింది. ఆనాటి గురువులు రిటైర్డ్ జీహెచ్‌ఎంలు నాగన్న, సుందర్, విజయ్‌కుమార్‌ను శాలువా, పూలమాలలు, మెమెంటోలతో సత్కరించారు. వంద మందికి పైగా హాజరైన పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరుగా తమ అభిప్రాయాలను వెల్లబుచ్చుతూ నేడు ఈ స్థాయిలో రాణించడానికి ఆనాటి గురువులు నేర్పిన క్రమశిక్షణే కారణమని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో 'నమస్తే తెలంగాణ' ఆర్థిక, పరిపాలన ఉపాధ్యక్షుడు చిరంజీవి, శంకర్‌ప్రసాద్, నూకల సత్యం, గోవిందుస్వామి, సత్యనారాయణశెట్టి, వెంకట్రాం, శేఖర్ రెడ్డి, తిరుమల మహేశ్ తదితరులు ఉన్నారు.

## ఆర్డీఎస్‌లో తగ్గుతున్న నీటి నిల్వలు

- రైతులు, అధికారుల్లో మొదలైన ఆందోళన
- 12నుంచి ఆర్డీఎస్ ఇండెంట్ టీబీ డ్యాం నుంచి నీటి విడుదల
- ప్రస్తుతం ఆనకట్టలో 7.5 అడుగుల నీటి మట్టం
- ప్రధానకాల్వకు 423 క్యూసెక్కులు విడుదల



ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పారుతున్న నీరు

అయిజ, ఫిబ్రవరి 9 : తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం నిలిచి పోతుండటంతో కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ క్రమేపీ తగ్గుతోంది. టీబీ డ్యాం నుంచి నీటి విడుదల నిలిచిపోయి ఐదు రోజులకే ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ తగ్గుముఖం పట్టణంతో ఆర్డీఎస్ రైతులతో పాటు అధికారుల్లో ఆందోళన మొదలైంది. మార్చి చివరి వరకు ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఆయకట్టులో యాసంగిలో సాగు చేసిన పంటలకు సాగునీరు అందాల్సి ఉండగా, ఫిబ్రవరిలోనే ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి మట్టం తగ్గుతుండడంతో పంటలు సాగు చేసిన రైతుల్లో గుబులు రేకెత్తుతోంది. ఆర్డీఎస్ నీటి వాటా 5.8 టీఎంసీలకు గానూ ఇప్పటికే 3 టీఎంసీల నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. మరో 2.8 టీఎంసీలు మిగిలి ఉండగా, ఈ నెల 12 నుంచి మరో టీఎంసీ నీటిని విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏపీలోని కర్నూల్ కేసీ కెనాల్ ఇండెంట్ నీటిని ఆర్డీఎస్ ఇండెంట్‌తోపాటు జాయింట్‌గా విడుదల చేస్తేనే ఆర్డీఎస్‌తోపాటు కేసీ కెనాల్ ఆయకట్టు, కర్నూల్ నగరపాలక సంస్థ, తుంగభద్ర నదితీర ప్రాంత గ్రామాలకు తాగునీరు, సాగునీటి కష్టాలు తీరతాయని ఇరు రాష్ట్రాల రైతులు, అధికారులు భావిస్తున్నారు. ఆర్డీఎస్ ఇండెంట్‌తోపాటు కేసీ కెనాల్ ఇండెంట్‌ను ఈ నెల 12నుంచి విడుదల చేసేలా తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**ఆర్డీఎస్ ఆనకట్టలో 7.5 అడుగుల నీటిమట్టం..**

కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి మట్టం రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. టీబీ డ్యాం నుంచి నీటి విడుదల నిలిచిపోయిన ఐదు రోజులకే ఆనకట్టలో నీటి నిల్వ 7.5 అడుగులకు తగ్గిపోవడంతో ప్రధానకాల్వకు నీటి చేరికలో వ్యత్యాసం వస్తుంది. కర్ణాటకలోని ఆర్డీఎస్ ఎగువ ప్రాంత రైతులు నీటిని అక్రమంగా తోడేయడంతోనే ఒక్కరోజులోనే 0. 5 అడుగులు ఆవిరైపోవడంతో ఆనకట్టలో నీటి నిల్వలు పడిపోతున్నాయి. ప్రస్తుతం ప్రధానకాల్వకు 423 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఈ నెల 12నుంచి ఆర్డీఎస్ నీటి వాటా నీటిని టీబీ డ్యాం నుంచి విడుదల చేసేందుకు ఈఎన్‌సీకి ఇండెంట్ పంపామని, సోమవారం ఉత్తర్వులు టీబీ బోర్డుకు చేరుతాయన్నారు.

## మట్టి మాఫియా బరితెగింపు

- పట్టపగలే మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు
- సమాచారం అందించినా స్పందించని పోలీసులు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 9 : అక్రమ మట్టి, ఇసుక, పీడీఎస్ బియ్యం తరలింపును అడ్డుకోవాల్సిన పోలీసు అధికారులే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాక్టర్లు, జేసీబీ వాహనాలు పెట్టి చెరువులను కొల్లగొడుతున్నారని ఫిర్యాదు చేస్తే నియోజకవర్గ ప్రజాప్రతినిధికి చెప్పాడంటు పోలీసులు తెలియచేయడంతో ఓ ఫిర్యాదుదారుడు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పోలీసు అధికారుల అండదండలతో మట్టి మాఫియా చెరువులో ఉన్న మట్టిని దర్జాగా పట్టపగలే తరలించినట్లు సమాచారం. కేటీదొడ్డి మండలం పరిధిలోని గంగన్‌పల్లి శివారు ప్రాంతంలోని ఓ చెరువులో ఆదివారం మట్టి మాఫియా అడ్డు అదుపు లేకుండా మట్టిని తరలించడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అనుమతులు లేకుండా మట్టిని ఇష్టానుసారంగా చెరువుల్లో మట్టి తవ్వకాలు జరపడంపై సర్వత్రా విమర్శలు వినబడుతున్నాయి. జేసీబీల సహకారంతో చెరువులో పెద్ద మొత్తంలో మట్టిని అక్రమంగా తరలిస్తు చదును చేస్తున్నారు. ఈ వ్యవహారం పట్టపగలే జరుగుతున్నా వాటిని అరికట్టల్సిన పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని కొంత మంది పోలీసులకు సమాచారం అందిస్తే స్పందించాల్సిన పోలీస్ అధికారులు.. మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఉచిత సలహాలు అందించడం పట్ల సర్వత్రా చర్చ మొదలైయింది. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీసు అధికారులు ఈ విధంగా ఉచిత సలహాలు చెప్పడం ఏంటని పలువురు చర్చించుకున్నారు. ఈ విషయంపై కేటీదొడ్డి ఎస్సై శ్రీనివాస్ వివరణ కొరగా...మట్టి తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని తెలియచేశారు.

## హామీలను నెరవేర్చాలి..

- రామాపురంలో ప్రజా ఆవేదన నిరాహారదీక్ష



రామాపురంలో నిరాహారదీక్ష చేస్తున్న చంద్రయ్యయాదవ్

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ.. ఆదివారం మండలంలోని రామాపురంలో స్థానిక సామాజిక నాయకులు చంద్రయ్యయాదవ్ గ్రామ రచ్చబండ వద్ద ప్రజా ఆవేదన నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలతోపాటు గ్రామ సమస్యలపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడంతో దీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీక్షకు గ్రామ ప్రజలు పాల్గొని మద్దతు తెలిపారు.

## బిజినేపల్లి పాత ఎంపీడీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం

- మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- మంటల్లో వెలుగు చూసిన వ్యక్తి మృతదేహం

బిజినేపల్లి, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని పాత మండల ప్రజా పరిషత్ కార్యాలయం వెనకభాగంలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. గమనించిన కార్యాలయ సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. ఈక్రమంలో అగ్నికి ఆహుతవుతున్న గదిలో సుమారు 50 ఏండ్ల వయస్సుగల ఓ వ్యక్తి మృతదేహం పూర్తిగా కాలిపోయి కనిపించడంతో అగ్నిమాపక సిబ్బంది కంగుతిన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పూర్తిగా కాలిన మృతదేహాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయంతో బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.